


— మహర్షి

# గోతిగాడు

"మా వారు అప్పుడే రారు సుబ్బీ! నువ్వు నీ కూతుర్ని ఆడించుకుంటూ హాల్లో కూర్చో. నేను టిఫిన్ తయారు చేస్తాను. ఎంచక్కా మనమే తినేద్దాం" అని పాపాయమ్మ వంటింట్లోకి దూరింది. చీకటి పడుతుండగా.

"అవునక్కా, బావగార్ని నేనింత వరకు చూడలేదు. ఎలా వుంటారేం" అడిగింది.

సుబ్బి పాపాయమ్మ చిన్నమ్మ కూతురు. సదరు వాళ్ళు ఆ సమయంలో పెళ్ళికి అఘోరించ బడలేదు. రాక రాక వచ్చిన చెల్లెల్ని చూసి మురిసిపోయింది.

"ఆ... ఉంటార్లే గోతివాలె" అని కిసుక్కున నవ్వి పకోడీలు వేస్తున్నది.

"అదేం పోలికే తల్లీ" అనుమానంగా అడిగింది సుబ్బి.

"అది నా ఖర్మ. ఏం చెప్పనే సుబ్బీ! చెప్పుకుంటే సిగ్గు చేటు" ముక్కు చీరున చీదింది పాపాయమ్మ.

అంతలో వీధిలోనికి తొంగి చూసిన సుబ్బి కూతురు కెవ్వున కేకలేసి పరుగెత్తుకొచ్చి తల్లిని చుట్టుకుపోయి బావురుమన్నది.

"ఏమైంది తల్లీ. ఏమున్నదక్కడ?"

"బూచోడు వస్తున్నాడమ్మా" ఆ పాప చెప్పి మరింత హత్తుకుపోయింది.

అంతలో గేటు దగ్గరకొచ్చిన మనిషిని చూసి జడుసుకుని "థూ...థూ" అని వీపు మీద కొట్టుకుని "ఈ ముష్టివాళ్ళకు వేళాపాళా లేదు. దీపాలు పెట్టుకునే వేళకొస్తారేమిటే! ఏయ్ అక్కా! మీ హైదరాబాద్‌లోని అడుక్కునే వాళ్ళకు వేళాపాళా వుండదేమిటే.

ఎప్పుడు పడితే అప్పుడు వస్తారు" సుబ్బి దీర్ఘం తీసింది.

"రాజకీయ నాయకులకంటే వీళ్ళే నయమే తల్లీ" పకోడీలో ఉప్పు సరిపోయిందో లేదోనని రెండిట్నే నోట్లో వేసుకుని నోరు కాలి కెవ్వున అరిచింది.

"ఎందుకలా అరుస్తున్నావ్! బయట ముష్టివాడు తప్పాడుతున్నాడు. ఇదిగో అబ్బీ చేయి ఖాళీగా లేదు. వెళ్ళెళ్ళు" కసురుకుంది సుబ్బి.

జంగయ్యకు ఆ ఇల్లు తనదేనా అని అనుమానం వచ్చింది. నెంబర్ చూసి తనదే అనుకుని గేటు తీశాడు.

"ఇదిగో నీకే చెప్పేది. గేటు తీసుకుని వస్తావేమిటి? మా పాప భయపడుతోంది" సుబ్బి గొంతులో వణుకు ప్రారంభమైంది.

'పాపాయమ్మా!' గట్టిగా అరిచాడు జంగయ్య.

"ఇదేం చోద్యమే అక్కా! ముష్టోళ్ళకు హైదరాబాద్‌లో మరీ ఇంత చనువేమిటే! అవ్వ— అవ్వ పేరు పెట్టి మరీ పిలుస్తున్నాడంటే ఎంత పరువు తక్కువ" నోటి మీద చేతులేసుకుని గబగబ బాదుకున్నది సుబ్బి.

అంతలో పాపాయమ్మ అప్పడాల కర్రతో ప్రత్యక్షమైంది. మసక చీకటిలో ఆ మనిషిని చూసి భయంతో కెవ్వున అరచి, అంతలోనే తేరుకుని 'దొంగ వెధవా! ఇంట్లో గోతిగాడు లేడని, ఆడాళ్ళను భయపెట్టి ఇల్లు దోచుకుందామని వచ్చావా? అని చేతులోని కర్రతో ఒక్కటి పెట్టింది. అంతే! జంగయ్య ధభీమని క్రిందపడ్డాడు.

సుబ్బి చటుక్కున లేచి "అక్కా చచ్చాడేమో!" అని బయట లైటు వేసింది. పాపాయమ్మ క్రింద పడినతన్ని చూసి బావురుమని ఏడ్చింది.

"చచ్చాడు వెధవ చచ్చినోడు" అంటూ బయట కొచ్చింది సుబ్బి.

"ఎంత ఘోరం జరిగిందే సుబ్బీ! ఈయన ముష్టివాడు కాదే సుబ్బీ! ఎంత తొందరపడ్డానే సుబ్బీ! ఈయన ముష్టివాడు కాదే సుబ్బీ! ఎంత తొందరపడ్డానే సుబ్బీ! ఈయనే మీ బావగారు సుబ్బీ. నా కొంప మునిగిందే సుబ్బే! పోయినట్లున్నారే సుబ్బీ! నాకింకా ఎవరు దిక్కే సుబ్బీ! నన్ను అన్యాయం చేసి పోయాడే సుబ్బీ! కనీసం ఇన్సురెన్స్ కూడా చేసుకోకుండా నన్ను నట్టేట ముంచి పోయాడే సుబ్బీ" పాపాయమ్మ శోకాలకు చుట్టు ప్రక్కన వాళ్ళంతా వచ్చేశారు. అంతా గబగబా జంగయ్యను నాడి పట్టి చూసి "ఇంకా చావలేదు. అప్పుడే చచ్చినట్టు ఏడుస్తావేంటి?" విసుక్కున్నారు.

జంగయ్య ముఖం మీద నీళ్ళు చల్లి మెల్లగా లేపి కూర్చోబెట్టారు.

"జంగయ్యా! ఈ వేషం ఏమిటి ఏమైంది. ఒళ్ళంతా ఈ బురద ఏమిటి? ఈ మురికి వాసన భరించలేక ఛస్తున్నాను" ముక్కు గట్టిగ మూసుకుని అడిగాడొకాయన.

జంగయ్య భయంగా భార్యవైపు చూసి బస్సు దిగి వస్తుంటే వెనుక నుండి... అతన్ని పూర్తి చెయ్యనీయకుండానే మళ్ళీ శోకాలు అందుకున్నది పాపాయమ్మ. "ఎవరు కొట్టారు ముదనష్టపు వాళ్ళు? కొట్టేవాళ్ళు మరీ ఇంత ఘోరంగా కొడతారా? వాళ్ళ చేతులు పడిపోను, వాళ్ళ జిమ్మడ. మరీ మురికి కాలవలో పడేసి బాదితే, ఆ వాసన ఎలా భరించాలి. ఈ కంపుకు కడుపులో తిప్పుతున్నది. వాళ్ళను ఆ మురికి నీళ్ళలో ముంచ...

"నన్ను ఎవరు కొట్టలేదు. నేను వస్తుంటే వెనుకగా బస్సు వచ్చింది. రోడ్డు మీద వున్న మురికి నీళ్ళు నా మీదపడినా అవతారం మారిపోయింది" మెల్లగా చెప్పారు జంగయ్య. చుట్టు ప్రక్కల వాళ్ళు మెటికల్ విరుస్తూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

పాపాయమ్మ పకపకా నవ్వింది. జంగయ్య విస్తుపోయాడు అంతవరకు శోకాలు తీసిన పాపాయమ్మ అలా నవ్వేటప్పటికి.

"ఎవరు తీసిన గోతిలో వాళ్ళే పడతారనే సామెత ఎంత బాగా తెలిసింది! చేసిన నిర్వాహకం చాలు. లేచి లోపలకెళ్ళి స్నానం చేయండి" విసవిసా లేచి లోపలకు వెళ్ళింది పాపాయమ్మ.

చెల్లెలు సుబ్బిని పిలిచి భర్తను పరిచయం చేసింది.

రాత్రి భోజనాలయ్యాక సుబ్బికి ప్రక్క గదిలో పక్క వేసి పాపాయమ్మ భర్త ప్రక్కకు చేరింది. అంతే! మరుక్షణం భళ్ళున వాంతి చేసుకున్నది.

జంగయ్య ఆనందం పట్టలేక "హుర్రే" అని గట్టిగా అరిచి భార్యను కౌగిలించుకున్నాడు. ప్రక్క గదిలో పాప పెద్దగా ఏడ్చింది భయంతో. పాపాయమ్మ మళ్ళీ వాంతి చేసుకుంది. జంగయ్య గబగబ నీళ్ళు అందించి చకచక చెంపలు గుద్దుకున్నాడు ఆనందంగా.

"ఎందుకా సంతోషం" కొరకొరా చూస్తు మూతి గిరగిరా తిప్పింది పాపాయమ్మ.

"ఎందుకేమిటి? నేను తండ్రిని కాబోతున్నా నన్నమాట" భార్య వైపు విలిపిగా చూశాడు.

"ముందు మీరు గోతులు తవ్వడం మానండి. జనం ఉసురు తగిలి నా కడుపు పండటం లేదు. నేను వాంతి చేసుకున్నది మీ దగ్గర మురికంపు ఇంకాపోలేదు" విసుక్కున్నది పాపాయమ్మ.

● ● ● ●

ప్రక్కింటాయన పరుగు పరుగున వచ్చి "పాపాయమ్మ! మొన్నా మధ్య మీ ఆయనకు ఏదో అయిందని ఏడ్చావు కదా! అలా ఇప్పుడు ఏడువ్! స్కూటర్ మీద వస్తూ గోతిలో పడి దెబ్బలు తగిలాయట. హాస్పటల్‌లో వున్నాడు" చెప్పాడు.

పాపాయమ్మ వలవల ఏడ్చింది. నెత్తీనోరు భాదుకున్నది.

వివరకు ఆ గోతికే బలయ్యాడురోయ్ దేవుడా! రేపట్నుండి నన్ను చూసి గొతులు గాడి పెళ్ళాం అని చెప్పుకుంటుంటే విని ఎలా భరించాలిరోయ్ దేవుడా! గోతులగాడి పెళ్ళాంగా బతికేకంటే ఆయునతో పాటు గోతిలో పడి సహగమనం చేసుకుంటాను. ఇలాంటి మాటలు నేను పడలేను" ఇంటికి తాళం వేసి పరుగు పరుగున హాస్పిటల్‌కు చేరింది. ఆమె శోకాలకు హాస్పటల్ సిబ్బంది విసుక్కున్నారు" ఇంకా బ్రతికే వున్నారు. చావక ముందే ఎందుకు ఏడుస్తావ్! చచ్చిన తరువాత ఎటూ తప్పదు కదా!" అన్నారు. పాపాయమ్మ పైట కొంగు మొత్తం నోటిలో కుక్కుకుని కళ్ళ వెంట నీళ్ళు కారుస్తున్నది.

● ● ● ●

వారం రోజులు గడిచిపోయాయి. జంగయ్యకు స్పృహ రాలేదు. డాక్టర్ వచ్చి చెప్పాడు. "మీ ఆయనకు స్పృహ మాత్రం వచ్చింది. ఎవరినీ గుర్తించడం లేదు. తలకు బలమైన దెబ్బ తగలడం వలన మతి భ్రమించింది. ఏమిటో చేతులు గాలిలో వూపుతూ ఏదో చేస్తున్నట్లు ఫీలవుతున్నాడు. ఇంతకు ఆయన ఏం చేస్తుంటారు?" అడిగాడు.

పాపాయమ్మ నోట్లోని పైట చెంగు తీసి, కళ్ళ వత్తుకుని, ఓ నిట్టూర్పు విడచి "గోతులు తవ్వుతారు" మెల్లగా చెప్పింది.

"అయితే మీ ఆయన శ్మశానంలో గోతులు తవ్వి సమాధులు కడతారా?" అన్నారు డాక్టర్ సింపుల్‌గా.

"కాదండి."


"మరి?"

"ఏం చెప్పమన డాక్టర్ గారూ! చెప్పాలంటేనే సిగ్గుగా వుంది. ఈయన టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌లో లైన్ మెన్‌గా పని చేస్తున్నారు. ఈయనకు ఎక్కడైనా చక్కని రోడ్డు కనిపించిందంటే చేతులు దురదలు పుడతాయి. వెంటనే బంగారంలా వేసిన రోడ్డు వేస్తే రాత్రికి రాత్రి ఈయనవెళ్ళి రోడ్డుకడ్డంగా తవ్వి హాయిగా నిద్రపోవడం అలవాటయింది" తల వంచుకుని చెప్పింది పాపాయమ్మ.

"పాపాయమ్మ గారూ! మీ వారు తిరిగి కోలుకోవాలంటె అర్జంటుగా చక్కగా వున్న రోడ్ల అడ్డంగా తవ్వించాలి. కానీ మన జంట నగరాల్లో మీ ఆయనకు బలికాని రోడ్డు మిగిలి లేదు. మొత్తం తవ్వేశారు. రోడ్డన్ని గోతులమయం అయ్యాయి. జనం అష్టకష్టాలు పడుతున్నారు. కాబట్టి నేను ఒక్క సహాయం చేయగలను" అన్నాడు డాక్టర్.

"ఏమిటో చెప్పండి డాక్టర్! ఢిల్లీ రోడ్లు చాలా బాగుంటాయంటారు. నా భర్త కోలుకుంటాడంటే అక్కడికైనా తీసుకెళతాను. నా పాతివ్రత్యాన్ని నిరూపించుకుంటాను" ఆదుర్దాగా అడిగింది పాపాయమ్మ.

"అంతదూరం అవసరం లేదమ్మా! ఈ రాత్రికి ఎయిర్ పోర్ట్‌లోని రన్ వేను తవ్వించు. తెల్లారేటప్పటికి మీ ఆయన మళ్ళీ మామూలు మనిషి అవుతాడు" చెప్పాడు డాక్టర్. ● □




జనజీవన ప్రవంతిలో నిత్యం ఎదురయ్యే సమస్యలకు.

కల్తీ, అక్రమ వ్యాపార పద్ధతులకు.

ప్రభుత్వ, ప్రైవేట్ సర్వీసుల్లో మోసాలకు.

నష్టపోయిన సందర్భంలో పైసా ఖర్చులేకుండా నష్టపరిహారాన్ని వడ్డీతో సహా చట్టప్రకారం అందించే సలహాలతో 'వినిమయవేదిక' మీకు సహకరిస్తుంది.

# వినిమయ వేదిక

దైనందిన జీవితంలో ఎదుర్కొనే సమస్యల తోరణాలకు పరిష్కారం చూపించే 'మణిమయవేదిక', ఈ 'వినిమయవేదిక'.



ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల సంఘాల సమాఖ్య ఛైర్మెన్
మందడి కృష్ణారెడ్డి

నిర్వహించే ఈ శీర్షిక 'మయూరి' పాఠకులకు సగర్వ కానుక.

మీ సమస్యలు, సందేహాలు పంపాల్సిన చిరునామా—

మందడి కృష్ణారెడ్డి,
కన్స్యూమర్స్ అవేర్‌నెస్, రీసెర్చ్ సొసైటీ,
పోస్ట్‌బాక్స్ నెం: 3, ఖైరతాబాద్
(హెచ్.పి.ఓ.)

హైదరాబాదు—500 004.